# ఒకనాటి కవితావైభవం

## – సంధ్య యెల్లాప్రగడ



**-3-**

# పాల్కురిసోమనాథుడు - బసవపురాణము

కాకతీయ సామ్రాజ్యములో మొదటి ప్రతాపరుద్రుడు స్వయంభూదేవుని మంటపమును సందర్శించాడు. ఆ సమయములో ఎందరో ప్రజలు పురాణము వింటున్నారు. రాజు ఆశ్చర్యపడి “అదేమని” అడిగాడు.

“అది బసవపురాణము. పాల్కురికి సోమనాథుడు ద్విపదలో రచించాడు. ప్రామాణికము కాదు” అని ఆ విప్రుడు సమాధానమిచ్చాడు.

అది విని కొందరు శివ భక్తులు ఆగ్రహించారు. (తరువాత కథ రసవత్తముగా సోమనాథుని మహిమను తెలుపుతూ సాగుతుంది. ఈ వ్యాసము ఆయన సాహిత్య సృష్టి గురించే కాబట్టి ఇక్కడ అప్రస్తుతం). కేవలము దేశీ సాంప్రదాయాన్ని అనుసరించాడని, బసవపురాణము చెడ్డదీ కాదు, సోమనాథుడు పతితుడు కాదు. దేశీ సంప్రదాయములో పురాణము రచియించిన పరమ అపర పరమేశ్వరుడు. ఆ బసవ పురాణముతో సోమనాథుని మతదీక్షతో పాటూ, కవితా దీక్ష కూడా పండ బారింది.

తెలుగు సాహిత్యంలో దేశికవితకూ, ద్విపద రచనకూ సోమనాథుడు కవితా శరత్కాల రాకాసుధ. సోమనాథుడు భక్తకవి. వీరశైవ మతోద్ధరణకు తన పాండిత్యాన్ని వినియోగించిన కవిశేఖరుడు. పరమతాలను ఖండించవలసి వచ్చినప్పుడు తన కవిత్వముతో సిద్ధాంత ఖండన చేసిన ఘనుడు. ఆయన వ్యక్తిత్వం విలక్షణమైనది. ఆయన కవిత్వము బసవార్పణమైనది. వీరశైవముకు అక్షరార్చన చేసిన ఈ కవి వివిధ రకాలైన సాహిత్య ప్రక్రియలలో తన భక్తిని పరిపుష్టి చేసుకున్నారు. శతకాలు, రగడలు, గద్యాలు, కావ్యాలు, భక్తి కృతులతో శైవ మతాన్ని బలోపేత్తము చేసిన వీర భక్తకవి.

“తొలితెలుగు కవి అంటే పాల్కురి సోమనాథుడే” అంటారు డా. ముదిగొండ శివప్రసాద్ గారు. “తెలుగు ఇతివృత్తాలు, తెలుగు చందస్సు, తెలుగు నుడికారము, జాను తెలుగును స్వీకరించి కావ్యరచన చేశాడు. అందుకే సామనాథుడు తెలుగుకవి” అంటారాయన.

“తొలికోడి కనువిచ్చి నిలిచి మైవెంచి
జలజలఱెక్కలు సడలించి నీల్గి

గ్రక్కున ఁగాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీఁకెలు చక్కొల్పి కడుపు
వెక్కించి మెడసాచి నిక్కి మిన్ సూచి
కొక్కురొకుఙ్ఞని కూయకమున్న" (పండితారాధ్యచరిత్రము)"

తెలుగులో నన్నయ్య తరువాత శివకవుల యుగమని పేరు పెట్టి సోమనాథుని వదిలేశారు విమర్శకులు. ఆయనకు రావలసిన పేరు రాలేదు. బండారు తమ్మయ్యగారు మాత్రము "ఆంధ్ర కవులలో సర్వజ్ఞతాశక్తి గల నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ, నన్నెచోడుడు, నాచన సోమనాథుడు, శ్రీనాథుల మించిన విద్వత్కవిగా నీతనిని గణింపనగును" అంటారు. ఆయనను తరువాతి కవులు ప్రశంసిచపోవటానికి కారణము బహుశా సోమనాథుడు విస్తారముగా రచించినందువలన కాబోలు. మితభాషి స్తుతి పాత్రుడవుతాడని లోకోక్తి కదా.

"ఆయన ప్రశాంతుడు కాకపోవటము" కారణమని అనంతకృష్ణశర్మగారు అంటారు. "అతనిది అణపరాని ఉద్రేకము. భావ బలమే లేని వట్టి శుష్క కల్పనలతో నిండిన మన ప్రబంధముల వంటివి చదివి, చప్పడి పడిన కొందరిని ఇతని గ్రంధములు ఆవకాయ వలె ఆకర్షించును. ఇక శైవ భక్తి కలవారి మాట చెప్పబనిలేదు" అంటారు అనంతకృష్ణశర్మగారు.

తెలంగాణాలోని పాల్కురి లేదా పాలకుర్తి అన్న గ్రామములో క్రీ.శ. 1140 ప్రాంతములో జన్మించాడు సోమనాథుడు. తండ్రి విష్ణర్మిదేవుడు. తల్లి శ్రీమాదేవి. వీరు బ్రహ్మణులే యని సోమనాథుని రచనలు చెబుతాయి. ఆయన రచనలలోని వేదవిజ్ఞానము ఆ విషయము స్పష్టము చేస్తుంది. తన దీక్షా గురువు గురులింగార్యుడు అని చెప్పుకున్నాడు సోమనాథుడు. వీరశైవము రాజమతముగా వున్న కాకతీయుల కాలములో జన్మించి, కర్ణాటకలోని "శైవపీఠిక" అన్న చోట శివైక్యము చెందాడు సోమనాథుడు.

సోమనాథుని కవిత్వములో వీరత్వము ప్రదర్శించే ఓజో గుణము కనపడుతుంది. ఆయన ద్విపద పరుగులు పెడుతుంది. ఆ ద్విపదకు వళ్ళంతా కాళ్ళు. భక్తి ఆవేశముతో ప్రకటితమవుతుంది. ఆయనకున్న దేశ కవితాభిమాన్నాన్ని చాటి చెపుతుంది ద్విపద.
రెండు పాదములు గల ఒక ప్రత్యేకమైన చందస్సును తెలుగులో ద్విపదగా పరిగణించబడుతుంది. దేశీయమైన మాటలను చందోబద్ధముగా చెప్పుటకు ద్విపద మంచి అవకాశము. సోమనాథుడు ద్విపదతో నృత్యము చెయించాడు. శివుని గురించి చెప్పేటప్పుడు ఆయన ఆవేశానికి హద్దు వుండదు.

"బసవని శరణన్న బాపక్షయంబు బసవని శరణన్న ఁబరమప్పనము
బసవని శరణన్న ఁబ్రత్యక్షసుఖము బసవని శరణన్న భవరోగహరమప
బసవని శరణన్న భక్తిసేకూరు బసవని శరణన్న బంధముల్వాయు

బసవని శరణన్న భాగ్యముల్పొందు  బసవని శరణన్న ఁబరగు శీలంబు
బసవని శరణన్న ఁబాయు నాపదలు   బసవని శరణన్న ఁబ్రబలు సంపదలు" (బసవపురాణము ప్రథమాశ్వాసము)

"తెలుగుతోటలో కంఠమెత్తి తెలుగు వాళ్ళ కోసము, తెలుగు చందస్సులో తెలుగుపాట పాడిన కోయల" ఆయనంటారు ఆరుద్ర తన సమగ్ర ఆంధ్ర సాహిత్యములో.
తన కవిత్వముతో ఒక మహా ఉద్యమము చేశాడు సోమనాథుడు.

"వడిచారు జలమున కొడలెల్లగాళ్ళు
వడిగాలు చిచ్చున కొడలెల్ల నోళ్ళు
వడివీచు గాడ్పున కొడలెల్ల దలలు
వడిజేయు బసవనీ కొడలెల్ల భక్తి" (బసవపురాణము. ద్వితీయశ్వాసము)

ఎన్నో కృతులను శతకాలను రచించాడు సోమనాథుడు. "బసవ పురాణము, పండితారాధ్య చరితము, వృశాదిప శతకము, రుద్రభాష్యము, అనుభవసారము, బసవ పంచకము, బసవాంధ్య రగడ ఇత్యాదివి. సోమనాథుడు సంస్కృతాంధ్రలలో విశారదుడే కాక, ప్రాకృత, తమిళ, కన్నడ మహారాష్ట్రలలో కోవిదుడు. వైష్ణవ, అద్వైతాలలో జైన బౌద్ధవాలలో పండితుడు. మొదటి తెలుగు కవే కాదు, మొదటి ప్రజాకవి కూడా.
"ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు కోర్కి దైవార"  అని బసవ పురాణ అవతారికలో చెప్పుకున్నారు.

సమకాలీన సమాజానికి అద్దం పట్టడము ఉత్తమ సాహిత్య లక్షణాలలో ప్రధానమైనదైయితే, సోమనాథుని బసవపురాణము, పండితారాధ్యచరితము ఆనాటి సమాజానికి నిలువుటద్దాలు.
ఆనాడు మంత్రతంత్రాలు  సంస్కృతములో వుండేవి. తెలుగును ఆ స్థాయికి తీసుకురావటము కోసము బసవపురాణ, పండితారాధ్య చరిత్ర రచనలు అచ్చ తెలుగులో జరిగాయి.

"ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన
మానుగ సర్వసామాన్యంబు గాని
జాను తెనుంగు విశేషము ప్రసన్నతకు" అని పండితారాధ్యచరిత్రలో చెప్పాడు.

“తెలుగు మాటలు నంగ వలదు వేదముల” అంటాడు బసవ పురాణములో. నూటికి నూరుపాళ్ళ తెలుగది. నేటికి నిఘంటువులో ఎక్కని ఎన్నో మాటలను ఆయన బసవపురాణములో వాడాడు.

అల్పాఅక్షరములతో అనంతమైన అర్థము తీసుకురావటమే కవి సిద్ధాంతమని  సోమనాథుడు ప్రతిపాదించాడు. తరువాతి కాలములో తిక్కన అది అనుసరించాడు.

తొమ్మిది రసములు, పద్దెనిమిది వర్ణాలు, ముప్పై ఆరు అలంకారాలు, డైభై రెండు భావాలు వుండాలట కావ్యములో. ఇవ్వన్నీ వుండాలని సోమనాథుడు చెప్పారు. అంటే తన కవిత్వములో అవి వున్నాయని మనలను హెచ్చరించారు ఆ కవి. ఇవ్వన్నీ జాను తెలుగులో ద్విపదగా చెప్పినది బసవ పురాణములో. ఇలా రాసినది జనులకు తెలియటము ప్రధాన లక్షణము. ఈ లక్షణమే ఆయన కవిత్వాన్ని ప్రజల కవిత్వము చేస్తుంది.  అందుకే ఆయన మొదటి ప్రజాకవి.

తెలుగులో మొట్టమొదటి ద్విపద కావ్యమే కాదు, రగడ, మకుట సహిత శతకము రాసినది కూడా సోమనాథుడే. “. అలాగే సున్నితమైన భావ ప్రకటనకు కూడా ఆయన అందె వేసిన చెయ్యి. మచ్చుకి:

“తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు
దల్లి గల్గిన నేల తల జడల్గట్టు
దల్లి యున్న విషంబుద్రావనేలిచ్చు
దల్లి యుండిన దోళ్ళుదాల్చనేలిచ్చు
దల్లి పాములనేల ధరియింపనిచ్చు
దల్లి బూడిదనేల తా బూయనిచ్చు
దల్లి లేకుండిన తనయుడుగాన
ప్రల్లదుడై యిన్ని వాట్లకు వచ్చే” ఇది శివుని గురించి బెజ్జమహాదేవి అనే భక్తురాలు శివునకు తల్లి లేదని చింతిస్తూ అన్నమాటలు.

ఇదే కాదు గద్య కవి, ఉదాహరణకర్త, జానతెలుగులో రాసినది, దేశాయేతి వృత్తములో కావ్యము నిర్మించ్నది ఈయనే. వీరశైవము వైదికమని నిరూపించిన కవి, కన్నడ తెలుగుల సాహిత్య వారధి సోమనాథుడే. ఇటువంటి ఎన్నో ఘనకార్యాలున్నాయి  సోమనాథుని పేరున.

బహుభాషా పాండిత్యానికి ఉదాహరణ బసవేశ్వర శతకము. సంస్కృత, కన్నడ ద్రావిడ పద్యాలున్నాయి ఇందులో. భక్తి శతకాలలో విఖ్యాతిగాంచింది వృషాధిప శతకం!

ఉదాహరణకు:

ఉ. “అక్షయ భక్తిపక్ష! పసవాక్షర పాతక కల్పవృక్ష! రు
ద్రాక్ష విభూతిపక్ష! ఫలితార్థ ముముక్ష! శివప్రయుక్త ఫా

లాక్ష! కృపాసమంచిత కటాక్ష! శుభాశుభపాశమోక్ష! త
త్త్వక్షమ! నీవె దిక్కు బసవా! బసవా! బసవా! వృక్షాధిపా!"

బసవపురాణము సర్వ శ్రేష్ఠమైన రచన. తెలుగులో మహాకావ్యాల సరసన చేరుతుంది ఇది. బసవ పురాణము ప్రథమాంధ్ర దేశి పురాణము. తెలుగులో వెలిసిన తొలి స్వతంత్ర పురాణము. ఇది జైన పురాణాన్ని ప్రచ్ఛన్నముగా అనుసరించినట్లుగా కనపడుతుంది. జైన పురాణాలలో పంచ కల్యాణ నిర్మాణములు వుంటాయి. అవి గర్భావతరణ కల్యాణం, జన్మాభిషేక కల్యాణము, పరినిష్క్రమణ కల్యాణం, కేవల జ్ఞాన కల్యాణము, పరినిర్వాణ కల్యాణం. బసవపురాణములో కూడా మనకు ఆ పంచ కల్యాణములు కనపడుతాయి.

బసవేశ్వరుని చరిత్ర ఇతివృత్తము ఈ పురాణము. కర్ణాటకలోని వీరశైవము మొదలెట్టి జంగమ దీక్షలతో సర్వ సమానతను చాటిని బసవడు చరిత్రపురుషుడు. ఆయనని కథానాయకునిగా చూపుతూ పురాణము నిర్మించటము క్రొత్త ప్రక్రియ. సోమనాథుని దృష్టిలో బసవునికీ శివునకి అభేదము. అందుకే పురాణము రాయగలిగాడాయన.
ఆ బసవ పురాణము ఏడు అశ్వాసాల చరిత్ర. బసవపురాణములో బసవేశ్వరుడు నాయకుడు. బిజ్జలుడు ప్రతినాయకుడు. బిజ్జలుడు వింతైనవాడు. బసవేశ్వరుని పూజిస్తూ కూడా వీరశైవుడు కాలేదు, కారణము విశ్వాసము లేదు. బసవడు మాదాంబ గర్భసంజాతుడు కావటము "గర్భావతరణ". బసవడు ఉపనయనాన్ని మాని వీరమహేశ్వర వ్రతదీక్ష పూనటం పరినిష్క్రమణ, వివాహితుడై సంగమేశ్వరుని శరణు వేడటము ప్రథమ అశ్వాసము.
బిజ్జలుడు బసవేశ్వరునికి దండనాయక పదవి ఇవ్వటము, కళ్యాణ కటకములో బసవేశ్వరుడు శివాచార నిరతుడు కావటము, చెన్న బసవడు , బసవుని ఆరాధించటము, అల్లమ ప్రభువు బసవడిచ్చిన విందు ఆరగించి వరములివ్వటము, బసవడు తన మహిమను ప్రకటించటము వుంటాయి.
తృతీయములో జంగమునికి బసవేశ్వరుడు తన భార్య చీర విప్పించి తన జంగమ సేనా నిరతిని ప్రకటించటము, ముగ్ధ భక్తుల కథలు వున్నవి. చతుర్థములో మడివాలు మాచయ్య కథ, భక్తి వలన భక్తునికి వినయము ఏర్పడాలని చెబుతూ వుంటుంది.
కిన్నెర బ్రహ్మాది భక్తుల చరితలు పంచమములో, ఏకాంతరామాది భక్తుల కథలు షష్ఠిలో, శివనాగయ్య వంటి భక్తుల కథలు సప్తమములో వుంటాయి. బసవేశ్వరుడు ఆగ్రహించి సంగమేశ్వరము వెళ్ళి లింగైక్యము చెందటము, జగదేవాదులు బిజ్జుని వధించటమూ, అనతి కాలములో రాజ్యము నాశనము కావటముతో కథ ముగుస్తుంది. బసవ పురాణములో సమకాలీన, పూర్వ భక్తుల కథలు ఎన్నో చెప్పబడినాయి. అరువదినాలుగు నయన్నారుల గురించి కూడా చెప్పబడింది.

భక్తుడైన బసవన ప్రపంచమంతటినీ శివ స్వరూపముగా భావిస్తాడు. వీరభక్తిని సవైదికముగా మారుస్తాడు. అతను వినూత్న శైవమును ప్రతిపాదిస్తాడు. వర్గరహిత, వర్ణరహిత సంఘము స్థాపించాడు బసవడు. బసవడు ఆదర్శజీవి. భక్తుడు వైరాగ్యమూర్తి. ప్రచారములకు పోలేదు. వీరశైవము భక్తి ప్రధాన మతము. ఆ భక్తి ఆవేశపూరితమై సాహసోపేతమైన అద్భుత కార్యాల చేత వ్యక్తమవుతూ వుంటుంది. జంగముడు ఏ కులానికి, మతానికీ చెందనవాడైనా, శివునిలా

పూజనీయుడు. సహపంక్తి భోజనాలకు అర్హుడు. సోమనాథుడు వీరశైవము స్పష్టపరిచే విధముగా బసవపురాణాన్ని రచించాడు. బసవుడిని సాకార లింగముగా చూపుతూ శివునకూ బసవునకూ అభేదము చూపాడు సోమనాథుడు.

"వడిఁబారు జలమున కొడలెల్ల కాళ్ళు। వడిగాలు చిచ్చున కొడలెల్ల నోళ్ళు
వడివీచు గాడ్పున కొడలెల్ల దలలు। వడి చేయు బసవన కొడలెల్ల భక్తి॥"
బసవడు ప్రచారము చెయ్యనందుకు తరువాతి కాలములో వీరశైవము తగ్గినది.

బసవపురాణాన్నీ పురాణకల్పనంలోనూ, వస్తు సంవిధానములోనూ, చందోనిర్వహణంలోనూ, భాషాప్రయోగములోనూ దేశీయ సంప్రదాయాలను, నవీనగుణాలనూ మేళవించి ప్రథమాంధ్రస్వతంత్ర దేశీపురాణముగా నిర్మించాడు సోమనాథుడు. ప్రజల నాల్కలపై పుట్టి పెరిగిన పాటలలోని ప్రాసయతులను గ్రహించి సంప్రదాయ లక్షణాలను సంతరించుకున్న ద్విపదను చేపట్టి అటు పాడుకోవటానికీ, ఇటు చదువుకోవటానికీ అనువైన ప్రక్రియగా ద్విపదను గ్రహించాడు. అందుకే అప్పటి వరకూ పాటల రూపములో వున్నవి గ్రంథములోకి ఎక్కి పురాణస్థాయి పొందాయి. ఇది ఒక తెలివైన ప్రక్రియ. మతమును ప్రజలలోకి తీసుకుపోవటానికి ప్రజలకు చేరువైన మాటలతో, తేలికైన ద్విపదలో చెప్పటము. ప్రతిపాదించదలచిన విషయము చదువరులకు హత్తుకునేందుకు, రసావేశము కలిగించేందుకు సమానమైన అర్థాలు కల పదాలను మార్చి మార్చి పుంఖాను పుంఖాలుగా ప్రయోగించాడు.
"బాపురే! కన్నప్ప! ప్రథమ లింగంబు!
బాపురే! కన్నప్ప! ప్రథమవిలాస!
వల్లవో! కన్నప్ప! నాలింగముగ్ధ!
వల్లవో! కన్నప్ప! వల్లనైనార!"

శబ్దాలంకార అనుప్రాసలంటే మక్కువ ఎక్కువ ఆయనకు.
"ఖ్యాత దయాభిజాత! విపదంబుధిపోత! యజాతతత్త్వని
ర్ణేత! వినేత భక్తి పరిణేత! మనోరథదాత! జంగమ
స్తోత! ముముక్షుగీత పరిశోభితనీతిసమేత!సద్గుణ
వ్రాత శరణమయ్య బసవా! పసవా! పసవా! వృషాధిపా!" (వషాధిప శతకము)

సోమనాథుడు మచ్చలేని చంద్రుడు. తెలుగు సాహిత్యాన్ని ప్రభావితము చేసినవాడు.
సోమనాథుని ఈ పురాణము వలన ద్విపదకు పురాణస్థాయి వచ్చిందని విమర్శకులు భావించారు.
కవిత్వానికి భావావేశము జీవము. సోమనాథుని కవిత్వానికి అదే పంచప్రాణము. కవిత్వానికి పరమావధి ప్రజలకు చేరువవటము. అలా చూస్తే సోమనాథుని లక్ష్యము చేకూరింది.

ప్రజలను శివభక్తితో ముంచి తెలుగునాట శైవముకు జయకేతము ఎగురవేసిన సోమనాథునికి భక్తులు అనేకులు. కథలూ అనేకము ప్రచారములో వున్నవి.  ఆయన చేసిన కృవితాసృష్టి కేవలము శివకవులనే కాదు, తెలుగు సాహిత్యన్ని కూడా పూర్ణము చేసిందనటములో ఎంత మాత్రమూ సందేహములేదు.

సోమనాథుడు తన కవితాశక్తితో  తన గురించి ఇలా చెప్పుకున్నాడు
"ఆనయము పాలకురుకి సోమనాథడన బరుగువాడ మానవసంస
ర్గనివర్తకుడను గురుభక్తి నిరూపిత మానసుండ గృతకృత్యుండ"
అన రచనలో తాను కృతకృత్యుడని చెప్పుకున్నారు.
గురుభక్తే కాదు తెలుగు భాషసేవలో కూడా ఆయన కృతకృత్యుడే!!

Ref:

బసవపురాణము
బసవపురాణము పీఠిక – ఆచార్య జి.వి. సుబ్రమణ్యము
పాల్కురిసోమనాథుని కవితావైభవము – ముదిగొండ శివప్రసాద్
సమగ్ర ఆంధ్ర సాహిత్యము – ఆరుద్ర.

COMMENTS